పేదలకు ఇళ్ల స్థల పట్టాల పంపిణీ



ఆకివీడు: పెదకాపవరం గ్రామంలో పేదలకు ఇళ్ల స్థల పట్టాల్ని పంపిణీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



ఉండి: యండగండిలో ఆర్థిక సాయం అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: గతంలో పేదలకు స్థల పట్టాలు ఇచ్చి ప్లాట్లు చూపించని ప్రాంతాల్లో లేఅవుట్ వేయించి పేదలకు ఇళ్ల స్థలాల్ని చూపిస్తూ పట్టాలు అందజేస్తున్నామని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని పెదకాపవరం, గుమ్ములూరు గ్రామాల్లో శనివారం గతంలో కేటాయించిన స్థలంలో లేఅవుట్ వేసి, పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ స్థలం, పట్టా పొందిన లబ్ధిదారుల వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని సూచించారు. ఈ ప్రాంతంలో త్వరిత గతిన విద్యుత్ సదుపాయం, మంచినీటి సదుపాయం కల్పిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు రూ.1.80 లక్షల ప్రభుత్వ సహాయాన్ని అందజేస్తామని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు, సర్పంచ్ ఊసల బేబీ స్నేతు తహసీల్దార్ విజయభారతి, కఠారి రామకృష్ణ (రాము), కేశవ, పాతపాటి శ్రీనివాసరాజు, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ సంద్యాల సీతారామయ్య, వైఎస్సార్‌సీపీ మండల, యువజనకమిటీ అధ్యక్షులు అన్యం కృష్ణ, చిక్కాల చిన్నా, అంబటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

పండుగ రోజుల్లో పేదలు, వృద్ధులు ఆనందంగా గడిపే విధంగా ప్రభుత్వ పథకాలు దోహదపడుతున్నాయని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని వైఎస్సార్ సీపీ చినకాపవరం గ్రామ అధ్యక్షులు నాతిరెడ్డి అన్నవరం, సర్పంచ్ నాతిరెడ్డి ఆదిలక్ష్మి నివాసంలో 100 వృద్ధులు, వితంతువులకు దుప్పట్లు, నిత్యవసర వస్తువులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్షత్రీయ సేవాసమితి ఆధ్వర్యంలో సాయం

ఉండి: పండుగ వేళ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థిక సహాయాన్ని అందించి వారికి కూడా పండుగ సంతోషాన్ని పంచారు. మండలంలోని యండగండిలో క్షత్రీయ సేవాసమితీ ఆధ్వర్యంలో డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చేతుల మీదుగా 52 మందికి రూ.2500 చొప్పున రూ.1.30 లక్షలు ఆర్థిక సహాయంగా అందించారు. వీరిలో నిరుపేదలు 48 మంది కాగా నలుగురు ఇంజినీరింగ్ విద్యార్థులు ఉన్నారు. ఈ సందర్భంగా పీవీఎల్ మాట్లాడుతూ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఈ విధంగా నిరుపేదలకు, నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ రాజు, పెన్మత్స జగ్గరాజు, రుద్రరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



పెనుగొండలో పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ శ్యామలాసోనీ

పెనుగొండ: వికసిత్ భారత్ సంకల్ప యాత్ర శనివారం పెనుగొండ పంచాయతీ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన నరేంద్ర మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయతీ సిబ్బందిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ, బీజేపీ పెనుగొండ, పెనుమంట్ర మండలాల అధ్యక్షులు దొడ్డిపట్ల నాగూర్, కర్రి ప్రసాద్ రెడ్డి, పొన్నాడ సురేంద్ర పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు



కాళ్ల: పెద అమీరంలో సిద్ధం చేసిన బరులు



కాళ్ల: కోమటిగుంట ముగ్గులు వేసిన దృశ్యం

కాళ్ల: సంక్రాంతి సంబరాలకు మండలంలో పలు గ్రామాలు సిద్ధమవుతున్నాయి. సంస్కృతి, సంప్రదాయాలు ఇట్టుపడేలా పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు శనివారం నిర్వహించారు. అదేవిధంగా పలు గ్రామాల్లో ఆదివారం భోగి పండుగ సందర్భంగా భోగి మంటలు వేసేందుకు యువకులు పెద్దలు సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లో సీసలి, పెద అమీరం, మాలవానితిప్ప, కాళ్ళ, తదితర గ్రామాల్లో కోడిపందాలు వేసేందుకు బరులు సిద్ధం చేస్తున్నారు.

వీరవాసరంలో..

వీరవాసరం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వీరవాసరం మండలంలో కోడి పందేలకు బర్లు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రమైన వీరవాసరంతో పాటు రాయకుదురు, జొన్నలపాలెం, నవుదూరు, అండలూరు, మత్స్యపురి, మత్స్యపురిపాలెం తదితర గ్రామాల్లో కోడి పందేలు నిర్వహించడానికి బరులను సిద్ధం చేశారు. కోడిపందేల ముసుగులో పేకాటలు, గుండాటలు, పెద్ద ఎత్తున నిర్వహించడానికి సర్వసన్నద్ధం చేస్తున్నారు



వీరవాసరం: సంక్రాంతి సంబరాల్లో ఆకట్టుకున్న డూడూ బసవన్న

ముగిసిన రీ యూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం రీ యూనియన్ క్రికెట్ మ్యాచ్‌లు డీఎన్ఆర్ కాలేజీ గ్రౌండ్స్ లో ఘనంగా ముగిశాయి. శనివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భీమవరం గ్రీన్స్ జట్టుపై భీమవరం బ్లూస్ జట్టు విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భీమవరం గ్రీన్స్ జట్టు 25 ఓవర్లలో 147 పరుగులు చేయగా భీమవరం బ్లూస్ జట్టు 21 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 148 పరుగులు చేసి విజయం సాధించింది. ముగింపు సభలో జట్టు విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో డీఎన్ఆర్ కళాశాల సెక్రటరీ గాదిరాజు బాబు, బీజేపీ నాయకుడు పాకా వెంకట సత్యనారాయణ, ద్రోణాచారయ్య అవార్డు గ్రహీత గంగోలి ప్రసాద్, మాజీ రంజీ క్రీడాకారులు మంగేష్, శివరామరాజు, గ్రంధి చల్లారావు, మానేపల్లి సూర్య మాణిక్యం, డీఎస్ రాజు, గుణేశ్వరరావు, వేణుగోపాల్ పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా గ్రంధి చల్లారావు, బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కె.సతీష్, బెస్ట్ బౌలర్‌గా బాషా, ఫ్రెండ్ బెస్ట్ ప్లేయర్స్‌గా ఎస్.కృష్ణ మోహన్, నాచు రవి, బెస్ట్ క్యాచ్ పట్టినందుకు జి.శేఖర్ రాజులకు మెమెంటోలు, షీల్డ్ అందజేశారు.

ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు



భీమవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న విక్టర్ ప్రసాద్ తదితరులు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడ స్వరాజ్య మైదానంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈనెల 19న ఆవిష్కరించనున్నారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అన్నారు. శనివారం ఆయన భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ 200 ఎకరాల విస్తీర్ణంలో సుమారు రూ. 400 కోట్ల వ్యయంతో అంబేడ్కర్ విగ్రహాన్ని క్వాలిటీ ఆఫ్ లిబర్టీగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిందన్నారు. బడుగు, బలహీన వర్గాలు అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని విజయవాడకే తలమానికంగా నిలిచే అంబేడ్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి రాష్ట్రం నలుమూలల నుంచి కుల,మత, పార్టీలకు అతీతంగా స్వచ్ఛందంగా తరలిరావాలని విక్టర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. అంబేడ్కర్ భావజాలంతో ముఖ్యమంత్రి జగన్ పరిపాలన సాగిస్తున్నారని కొనియాడారు. అంబేడ్కర్ స్మృతివనం అందరినీ ఆకర్షించేలా ఆయన జీవిత చరిత్ర తెలిపే మ్యూజియం, మిని థియేటర్, కన్వెన్షన్ సెంటర్, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, లైబ్రరీ వంటి అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. దీంతో విజయవాడ నగరం ప్రజాదరణ పొందిన గొప్ప పర్యాటక, పుణ్యక్షేత్రంగా మారబోతుందన్నారు. విగ్రహావిష్కరణ సందర్భంగా ఈ నెల 19 వరకూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పండగ వాతావరణంలో పలు కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కె.శ్రీనివాసులు రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి కె.శోభారాణి, తహసీల్దార్ వై.రవి కుమార్, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చవ్వాకుల భరత్, పొన్నమండ బాలకృష్ణ, కోనా జోసఫ్, తాళ్ళూరు మధు, ఎ.వీరయ్య, బిరుదుగడ్డ రమేష్, బందెల ప్రమీల, కె.స్టాలిన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల బరుల ధ్వంసం



మహదేవపట్నంలో కోడి పందేల బరులు ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఉండి: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కోడిపందేలు నిర్వహించేందుకు ఎలాంటి అనుమతులు లేవని డీఎస్పీ శ్రీనాథ్ తెలిపారు. శనివారం మండలంలోని మహదేవపట్నం, చినపుల్లేరు తదితర గ్రామాల్లో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు నిర్వహించేందుకు సిద్ధం చేసిన బరుల డీఎస్పీ శ్రీనాథ్, ఆకివీడు రూరల్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్కడైనా కోడి పందేలు, జూదం వంటివి నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలి గాని వ్యసనాల జోలికిపోయి జీవితాలు పాడుచేసుకోవద్దని హితవు పలికారు.

గ్రామాల్లో అమ్మవార్ల జాతర సందడి

మొగల్తూరు: రామన్నపాలెం పంచాయతీ పులపర్తి వారితోటలోని శ్రీగుడవల్లమ్మ అమ్మవారి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతీ ఏటా సంక్రాంతి పండుగ నేపథ్యంలో భోగి రోజున రాత్రి అమ్మవారి జాతరను నిర్వహించడం ఆనవాయితీ. జాతర సందర్భం ఆలయానికి రంగులు వేయడం, చలువ పందిళ్లు వేయడం, విద్యుత్ దీపాలకరణలు పూర్తయ్యాయని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: పెనుమంట్ర గ్రామంలో వేంచేసియున్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 14 నుంచి 16 వరకు గ్రామ నడివీధిలో ఉన్న పూరిగుడిసె వద్ద నిర్వహిస్తామని ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తమనంపూడి సాయినారాయణరెడ్డి శనివారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, గరగనృత్యాలు బాణసంచా కాల్పులతో గ్రామంలో గరగలను ఊరేగింపుగా తీసుకుని వచ్చి పూరి గుడిలో ఉంచారు. ఈ నెల 16 వరకు అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తామని తెలిపారు.



పెనుమంట్రలో అమ్మవారిని పూరింటికి తీసుకువస్తున్న దృశ్యం.

నేటి నుంచి అయ్యప్పస్వామి తీర్థ మహోత్సవాలు



మార్టేరులో శ్రీఅయ్యప్పస్వామి ఆలయం

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీఅయ్యప్ప స్వామి 18వ తీర్థ మహోత్సవం ఈ నెల 14నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప సేవాసమితి సభ్యులు శనివారం విలేకరులకు తెలిపారు. 14న ఉదయం అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మేళతాళాలు, బుట్టబొమ్మలతో గ్రామోత్సవం, 15న ఉదయం గోపూజ, స్వామివారికి అభిషేకం, చందన అలంకరణ దర్శనం ఉంటుందన్నారు. మధ్యాహ్నం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, సాయంత్రం పడిపూజ, జ్యోతి దర్శనం, అలంకరణ దర్శనం, అఖండ అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. ఆలయ ఆవరణలో కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన కార్యక్రమాలు జరుగుతాయని 16న మాలికాపురతమ్మకు విశేష పూజలు నిర్వహిస్తారు.

ముమ్మరంగా రబీ నాట్లు



మాదివాడ ఆయికట్టులో రబీ నాట్లు వేస్తున్న దృశ్యం

ఆకివీడు: రబీ నాట్లు గ్రామాల్లో ముమ్మరంగా సాగుతున్నాయి. పలు చోట్ల వెదజల్లు పద్ధతిలో సాగు చేపట్టారు. తుపాను ప్రభావంతో ఆకుమడులు వేసేందుకు ఆలస్యం కావడంతో నాట్లు ప్రక్రియ కొనసాగుతోంది. రబీ సాగుకు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. పంట కాలువల్లో సమృద్ధిగా నీరుండటంతో రైతులు దమ్ము పనులను వేగవంతం చేశారు. దమ్ము పనులు పూర్తి అయిన వెంటనే నాట్లు వేస్తున్నారు. జనవరి నెలాఖరునాటికి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఉండి నియోజకవర్గంలో రబీ సాగులో 90 శాతం రైతులు ఎంటీయూ 1121 వంగడాన్ని సాగు చేశారని ఏడీఏ కె.ఎస్.శ్రీనివాసరావు చెప్పారు. మిగిలిని ప్రాంతాల్లో ఎంటీయూ 1010, 1153 వంగడాన్ని సాగు చేసినట్లు తెలిపారు.

వైభవంగా సప్తాహ మహోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురంనార్త్ పంచాయతీలోని పట్టాభి రామాలయంలో 60వ సప్తాహ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సప్తాహ మహోత్సవాలు ఈ నెల 19 వరకూ జరుతాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు ప్రత్యేపూజలు నిర్వహించి పవళింపు సేవలో పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని వాండ్రంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న పది మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.73 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఏ సూర్యనారాయణ తెలిపారు.

సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్ గ్రంధి



గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే పండుగ సంక్రాంతి అని, ఇది పల్లెల పండుగ, రైతుల పండుగ, మన పాడి పంటల పండుగగా సంక్రాంతి నిలుస్తుందన్నారు. సాంస్కృతిక మూలాలకు విలువనిచ్చే పెద్ద పండుగ సంక్రాంతి అని, భోగి మంటలు, రంగ వల్లులు, హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల ఆటలు, గాలి పటాల సందళ్లు, రైతు లోగిళ్ళలో ధాన్యం రాసులు, పిండి వంటలు, బంధుమిత్రుల సందడ్లతో కనువిందు చేసే మనందరి పండుగ సంక్రాంతి అన్నారు. సంక్రాంతి పండుగతో ప్రతి ఇంట్లో సిరులు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు.

కోడిపందేలు వద్దని సర్పంచ్ ఫిర్యాదు

పాలకోడేరు: మండలంలోని మండలం గొల్లలకోడేరు గ్రామంలో కోడి పందేలు, జూద క్రీడలు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ రవి ప్రకాష్ కి, పాలకోడేరు పోలీసులకు సర్పంచ్ కుక్కల లక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్రాంతి సంప్రదాయం ముసుగులో కోళ్లకు కత్తులు కట్టి నిర్వహిస్తున్న కోడి పందేలు జూద, క్రీడలకు కారణం ఎన్నో పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గొల్లలకోడేరు గ్రామంలో ఇటువంటి జూదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక మహిళలు కోరికపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఆమె వెంట ఉప సర్పంచ్ కలిదిండి శ్రీనివాస్ వర్మ, కుక్కల సత్యనారాయణ ఉన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైలు ఢీ కొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు తాడేపల్లిగూడెం జీఆర్‌పీ ఎస్సై జి.హరిబాబు తెలిపారు. శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు మేరకు 13వ తేదీ సాయంత్రం సుమారు 4 గంటల ప్రాంతంలో బాదంపూడి నుంచి చేబ్రోలు రైల్వే స్టేషన్లు మధ్య యార్డు సమీపంలో గుర్తు తెలియని సుమారు 40 ఏళ్ల వయస్సు, చామన చాయలో ఉన్న వ్యక్తి మృతదేహాన్ని రైలు పట్టాల వద్ద గుర్తించామన్నారు. అతడు ప్రయాణిస్తున్న రైలు నుంచి జారిపడిపోవడంతో అదే సమయంలో వేరొక రైలు ఢీకొని మృతి చెంది ఉంటాడని తెలిపారు. మృతుడు ఆరెంజ్ కలర్ నెక్ టీ షర్ట్, బ్లాక్ కలర్ జీన్ ప్యాంటు ధరించాడని చెప్పారు. మృతుని వివరాలు తెలియాల్సి ఉందని, మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ



మావుళ్లమ్మవారికి బంగారం సమర్పిస్తున్న భక్తులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మకు హైదరాబాద్‌కు చెందిన సుందర మహతి, కుటుంబ సభ్యులు శనివారం 14 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ అమ్మవారి ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు మావుళ్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈవీఎంలపై అవగాహన



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం సంచార రథం వద్ద అధికారులు

పాలకొల్లు సెంట్రల్: ఓటింగ్ యంత్రం ద్వారా ఓటు ఎలా వేయాలో? ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలని మునిసిపల్ కమిషనర్ బీఆర్ఎస్ శేషాద్రి అన్నారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం సంచార అవగాహన వాహనాన్ని ప్రారంభించారు. శేషాద్రి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఓటింగ్ యంత్రంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ సచివాలయాల్లో వీవీ ప్యాట్, ఈవిఎంల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించామన్నారు. ఈ సంచార రథాన్ని పలు కూడళ్లలో నిలిపి ప్రజలకు ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ వీరబ్రహ్మం, ఆర్ఐ శ్రీనివాసరాజు, డ్వాక్రా సీఎంఎం రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.


104 సేవల తనిఖీ



పెనుగొండలో 104 సేవలున తనిఖీ చేస్తున్న డీఎం మూర్తి

పెనుగొండ: 104 సేవలను ప్రజలకు మరింతగా చేరువ చేయడానికి కృషి చేస్తున్నట్లు డివిజనల్ మేనేజరు వైఎస్సార్ మూర్తి అన్నారు. శనివారం పెనుగొండ సచివాలయం-01లో 104 సేవలను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వాహనంలో పరికరాలు, మందులు, వాహన సిబ్బందిని పరిశీలించారు. 104 సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఈవో వర ప్రసాద్, పైలేట్ ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న వ్రత మహోత్సవాలు



విశేష అలంకరణలో వేంకటేశ్వర స్వామి

పెనుమంట్ర: మార్టేరు గ్రామంలో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరుని సామూహిక వ్రత మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని నిర్వహించే ఈ వ్రతంలో ధనుర్మాసం సందర్భంగా అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్వామివారిని తులసీ దళం, పుష్పాలతో అలంకరించి ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి వ్రత మహోత్సవాన్ని నిర్వహించారు. ధనుర్మాసం సందర్భంగా మమివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం గోదాదేవి కల్యాణం నిర్వహిస్తామని ఆలయ కమిటీ అధ్యక్షుడు కలగల చినబాబు తెలిపారు.

కుట్టు మెషీన్ల పంపిణీ



మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న సీఈవో శివశంకర్

పాలకొల్లు అర్బన్: వృత్తి నైపుణ్యతను పెంచుకుని ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలు ఎదగాలని కనెక్ట్ ఆంధ్ర సీఈవో కోట్ల శివశంకర్ కోరారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడో విడతలో కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు కుట్టు మెషీన్లు, ధ్రువీకరణ పత్రాలను శనివారం ఆయన అందజేశారు. మహిళలు టైలరింగ్ సొసైటీగా ఏర్పడితే పాఠశాల విద్యార్థుల డ్రెస్‌లు కుట్టడానికి ఆర్డర్లు ఇస్తామని హామీ ఇచ్చారు. స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఎ.కృష్ణారెడ్డి, మేనేజరు వడ్డె నారాయణరావు, గ్రామ సర్పంచ్ దిద్ల మణివజ్రం తదితరులు పాల్గొన్నారు.